## ఫిజికల్ ఎడ్యుకేషన్‌కు దరఖాస్తుల ఆహ్వానం

మెదక్ మున్సిపాలిటీ, జూన్ 19: కేంద్ర ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే లక్ష్మీబాయి నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ గ్వాలియర్‌లో 2023-24 సంవత్సర ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మెదక్ జిల్లా యువజన, క్రీడల అధికారి నాగరాజు తెలిపారు. ఈ విషయమై ఆయన సోమవారం ప్రకటన విడుదల చేశారు. రెగ్యులర్ ప్రాతిపదికన డిప్లొమా ఇన్ స్పోర్ట్స్ కోచింగ్(డీఎస్‌సీ), పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ స్పోర్ట్స్ కోచింగ్ (పీజీడీఎస్‌సీ), పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ ఫిట్‌నెస్ మేనేజ్‌మెంట్(పీజీడీఎఫ్‌ఎం) కోర్సుల్లో చేరేందుకు ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. అర్హత, ఫీజు, చివరి తేదీ తదితర పూర్తి వివరాల కోసం www.lnipe.edu.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని తెలిపారు. మరిన్ని సందేహాలకు 0751-4000887 నంబర్ ద్వారా సంప్రదించాలని సూచించారు. ఈ నెల ఆఖరు, లేదా జూలైలో ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారని తెలిపారు.

## న్యాయశాస్త్ర పట్టభద్రులకు శిక్షణ

మెదక్ అర్బన్, జూన్ 19: న్యాయశాస్త్ర పట్టభద్రులైన యువతీ యువకులకు ఉమ్మడి మెదక్ జిల్లాలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ గవర్నమెంట్ ప్లీడర్ వద్ద జూనియర్‌గా చేరితే స్టైఫండ్‌తో కూడిన శిక్షణ ఇప్పించనున్నామని జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి విజయలక్ష్మి తెలిపారు. ఈ విషయమై ఆమె సోమవారం ప్రకటన విడుదల చేశారు. శిక్షణకు ఉమ్మడి మెదక్ జిల్లా పరిధిలోని ఎస్సీ కులానికి చెందిన న్యాయశాస్త్ర పట్టభద్రులందరూ అర్హులేనని పేర్కొన్నారు. 3 సంవత్సరాల పాటు న్యాయశాస్త్ర పరిపాలనలో శిక్షణ పొందే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. 2023-24 సంవత్సరానికి ఉమ్మడి మెదక్ జిల్లాలో షెడ్యూల్డ్ కులాల అభ్యర్థులకు 8 సీట్లు కేటాయించనున్నామని తెలిపారు. న్యాయశాస్త్రంలో పట్టా పొంది వార్షికాదాయం 2 లక్షల లోపు ఉన్న ఔత్సాహిక అభ్యర్థులు ఈ నెల 30లోగా www.telanganaepass.egg.gov.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. ఆన్‌లైన్ దరఖాస్తు, ధ్రువపత్రాలను కలెక్టరేట్‌లోని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ కార్యాలయంలో అందజేయాలని ఆమె సూచించారు.



సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరైన పోలీస్ ఎస్సై, కానిస్టేబుల్ అభ్యర్థులు

## పరిశీలన క్షుణ్ణంగా...


### కొనసాగుతున్న పోలీస్ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియ

సంగారెడ్డి, జూన్ 19: పోలీస్ ఎస్సై, కానిస్టేబుళ్ల నియామక ప్రక్రియ చివరి దశకు చేరుకున్నది. సంగారెడ్డి జిల్లాకేంద్రంలోని పోలీస్ కల్యాణ మండపంలో అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన కార్యక్రమం సోమవారం నిర్విరామంగా కొనసాగుతున్నది. ఐదో రోజు అదనపు ఎస్పీ ఉషా విశ్వనాథ్ స్వయంగా పోలీస్ శాఖ నుంచి అభ్యర్థులకు అందిన వెరిఫికేషన్ ఉత్తరంతోపాటు సంబంధిత ఒరిజినల్ సర్టిఫికెట్స్ పరిశీలన చేయిస్తున్నారు. 800 మంది అభ్యర్థులకు 729 మంది అభ్యర్థులు సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియకు హాజరయ్యారు.

# ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

- జోగిపేటలో వ్యవసాయాధికారులు, టాస్క్‌ఫోర్స్ సోదాలు
- రికార్డులు, విత్తనాల ప్యాకెట్ల పరిశీలన
- నకిలీ విత్తనాలు విక్రయిస్తే జైలుకే...
- వ్యాపారులకు అధికారుల హెచ్చరిక

అందోల్, జూన్ 19: ఎలాంటి అనుమతులు లేకుండా రైతులకు ఎరువులు, విత్తనాలు విక్రయించినా, నకిలీ విత్తనాలు అంటగట్టి రైతులను మోసగించినా వ్యాపారుల లైసెన్స్‌లు రద్దు చేయడంతోపాటు కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని టాస్క్‌ఫోర్స్ అధికారి రామకృష్ణ హెచ్చరించారు. జోగిపేటలోని లక్ష్మీప్రసన్న, మన గ్రోమోర్ ఆగ్రో సేవాకేంద్రంతోపాటు పలు ఫర్టిలైజర్ దుకాణాల్లో పోలీసులతో కలిసి టాస్క్‌ఫోర్స్ అధికారులు సోమవారం తనిఖీలు చేపట్టింది. ఈ సందర్భంగా టాస్క్‌ఫోర్స్ అధికారి రామకృష్ణ మాట్లాడుతూ.. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు దుకాణాల్లో సోదాలు చేపట్టినట్లు వివరించారు. దుకాణాల్లో విత్తన ప్యాకెట్లపై కంపెనీ పేరు, గడువు తేదీ, స్టాక్ రిజిస్టర్, బిల్ బుక్కులను పరిశీలించినట్లు తెలిపారు. వ్యాపారులు విక్రయాలకు సంబంధించిన రికార్డులను తప్పనిసరిగా అందుబాటులో ఉంచాలని సూచించారు. రైతులు ఎట్టి పరిస్థితిలో రసీదులు లేకుండా ఎరువులు కొనకూడదని కోరారు. ఎక్కడైనా అక్రమంగా ఎరువులు, విత్తనాలు నిల్వ చేసినా, విక్రయించినా తమకు సమాచారం ఇవ్వాలని సూచించారు. నకిలీలపై ప్రభుత్వం సీరియస్‌గా ఉందని, వ్యాపారులు ఎట్టి పరిస్థితిలో నకిలీ విత్తనాలు విక్రయించడం, ఎక్కువ ధరకు అమ్మడం లాంటివి చేయకూడదని స్పష్టం చేశారు. రసీదుల్లో రాసిన ధరలే దుకాణాల్లోని ధరల పట్టికలో ఉండాలని చెప్పారు. దుకాణదారులు అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే తమ దృష్టికి తేవాలని రైతులకు సూచించారు. తనిఖీల్లో ఏడీఏ అరుణ, ఏవో విజయరత్న, ఏఈవోలు పాల్గొన్నారు.



జోగిపేటలో ఫర్టిలైజర్ దుకాణంలో రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు

## అర్జీదారుల సమస్యలు త్వరగా పరిష్కరించాలి


### మెదక్ ఎస్పీ రోహిణి ప్రియదర్శిని

మెదక్ అర్బన్, జూన్ 19: అర్జీదారుల సమస్యలు త్వరగా పరిష్కరించాలని మెదక్ జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (ఎస్పీ) రోహిణి ప్రియదర్శిని అన్నారు. జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి పలు ఫిర్యాదులను ఎస్పీ స్వీకరించారు. ఈ సందర్భంగా టేక్మాల్ మండలం బర్దిపూర్ గ్రామానికి చెందిన పెద్ద గొల్ల రజిత తన భర్త సాయిబాబా అదనపు కట్నం కోసం వేధిస్తున్నాడని ఫిర్యాదు చేసింది. 14 సంవత్సరాల క్రితం కట్నకానుకలు ఇచ్చి వివాహం చేసినా మళ్లీ కట్నం కోసం వేధిస్తున్నాడని ఆరోపించింది. తమకు ఇద్దరు కొడుకులు, ఒక కూతురు ఉన్నారని, తనను భర్త శారీరకంగా వేధిస్తుండడంతో తన తండ్రి పుట్టింటికి తీసుకెళ్లారని వాపోయింది. రెండు మూడు సార్లు పెద్దల సమక్షంలో తన భర్తతో మాట్లాడినా ప్రయోజనం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేసింది. తనకు న్యాయం చేయాలని విన్నవించింది. చట్ట ప్రకారం విచారణ జరిపి ఫిర్యాదికి తగిన న్యాయం చేయాలని ఎస్పీ అల్లాదుర్గం సీఐకి సూచించారు.

## బాక్సింగ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



హేమంత్



రామ్‌చరణ్

పుల్కల్, జూన్ 19: రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీల్లో సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండల కేంద్రానికి చెందిన విద్యార్థి లస్కరి రామ్‌చరణ్ ప్రతిభ చాటాడు. ఈ నెల 13న కరీంనగర్ అంబేద్కర్ స్టేడియంలో ఉమ్మడి జిల్లా బాక్సింగ్ బాలుర జట్టు ఎంపిక ప్రక్రియ కొనసాగింది. అందులో ప్రతిభ కనబరిచిన ఏడుగురు విద్యార్థులతోపాటు రాంచరణ్ రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాడు. రామ్‌చరణ్ ప్రస్తుతం టీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ సైనిక్ స్కూల్ (రుక్మాపూర్, కరీంనగర్ జిల్లా)లో పదో తరగతి చదువుతున్నాడు. ఆదివారం (18వ తేదీ) సాయంత్రం హైదరాబాద్ షేక్‌పేట్ జీహెచ్ఎంసీ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరిగిన బాక్సింగ్ బాలుర పోటీల్లోనూ రామ్‌చరణ్ పాల్గొని ద్వితీయ బహుమతి సాధించాడు. రాష్ట్రస్థాయిలో నిర్వహించిన ఈ బాక్సింగ్ పోటీల్లో రామ్‌చరణ్ సిల్వర్ మెడల్ సాధించడంతో సైనిక్ స్కూల్ పాఠశాల ప్రిన్సిపాల్ లచ్చయ్య, బాక్సింగ్ కోచ్ మానిక్యం శ్రీకాంత్, రాంచరణ్ తల్లిదండ్రులు అంజనేయులు, శాంత కుమారి, టీచర్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

### జాతీయ స్థాయికి ఆర్సీపురం విద్యార్థి

రామచంద్రాపురం, జూన్ 19: జాతీయ స్థాయి జూనియర్ బాక్సింగ్ పోటీలకు ఆర్సీపురానికి చెందిన హేమంత్‌కుమార్ ఎంపికయ్యాడు. షేక్‌పేట్‌లో జరిగిన రాష్ట్రస్థాయి జూనియర్ బాక్సింగ్ పోటీల్లో హేమంత్‌కుమార్ ప్రత్యర్థులను ఓడించి బంగారు పతకాన్ని కైవసం చేసుకున్నాడు. వచ్చే నెల అరుణాచల్‌ప్రదేశ్‌లో జరగనున్న జాతీయ స్థాయి బాక్సింగ్ పోటీల్లో హేమంత్‌కుమార్ ఆడనున్నారు. శేరిలింగంపల్లిలోని పీజేఆర్ స్టేడియంలో బాక్సింగ్ కోచ్ గిరిబాబు నేతృత్వంలో హేమంత్ శిక్షణ తీసుకుంటున్నాడు. ఈ సందర్భంగా హేమంత్ మాట్లాడుతూ.. జాతీయ స్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపికవ్వడం చాలా సంతోషంగా ఉన్నదని తెలిపారు. బాక్సింగ్ కోచ్ గిరిబాబు సూచనల మేరకు జాతీయ స్థాయిలో కూడా మెడల్ సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రస్థాయిలో గోల్డ్ మెడల్ సాధించిన హేమంత్‌ను బాక్సింగ్ క్రీడాకారుడు ఎస్సై కోటేశ్వర్‌రావు, మహిళా బాక్సింగ్ కోచ్ ప్రసన్నలక్ష్మి, కోచ్ గిరిబాబు ప్రత్యేకంగా అభినందించారు.

### భవనం పైనుంచి దూకిన

## కస్తూర్బా విద్యార్థిని

- రాయికోడ్ కేజీబీవీలో ఘటన
- పాఠశాలకు వచ్చిన రోజే ఎస్సెస్సీ స్టూడెంట్ ఆత్మహత్యాయత్నం

రాయికోడ్, జూన్ 19: మండల కేంద్రమైన రాయికోడ్‌లో ఉన్న కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో 14 ఏళ్ల వయసున్న స్నేహలత 10 తరగతి చదువుతున్నది. స్నేహలత ఝరాసంగం మండలంలోని ప్యారారం గ్రామానికి చెందిన దశరథ్ కూతురు. వేసవి సెలవులు ముగించుకుని సోమవారం విద్యాలయానికి చేరుకున్నది. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, బుజ్జగించి లోపలికి పంపించారు. వారు పాఠశాల నుంచి వెనుదిరగక ముందే స్నేహలత మనస్తాపం చెంది విద్యాలయం పైనుంచి దూకేసింది. తీవ్ర గాయాలు కావడంతో రాయికోడ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రథమ చికిత్స చేయించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం జహీరాబాద్ ప్రభుత్వ దవాఖానకు తరలించామని పాఠశాల ప్రత్యేక అధికారి దీపిక తెలిపారు.

## బ్రెయిన్ స్ట్రోక్‌తో బీటెక్ విద్యార్థిని మృతి

- శోకసంద్రంలో కుటుంబం
- పదేండ్ల క్రితం కొడుకు.. ఇప్పుడు కూతురు
- పట్టలేని దుఃఖంతో తల్లిదండ్రులు
- గొల్పర్తి గ్రామంలో విషాద ఛాయలు



ఎర్రం కావ్య (ఫైల్)

రామాయంపేట, జూన్ 19: పదేండ్ల క్రితం కొడుకు నేడు బీటెక్ చేస్తున్న కూతురు ఆకస్మికంగా పరిస్థితి విషమించి మృత్యువాత పడ్డ విషాద సంఘటన రామాయంపేట పురపాలిక పరిధిలోని గొల్పర్తి గ్రామంలో సోమవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. గొల్పర్తి గ్రామానికి చెందిన దంపతులు ఎర్రం శ్రీనివాస్-స్వప్నలకు ముగ్గురు కూతుర్లు, ఒక్క కొడుకు. పదేండ్ల క్రితం వింత వ్యాధి సోకి చేతికొచ్చిన కుమారుడు కుప్పకూలి మృత్యువాత పడ్డాడు. ప్రస్తుతం ముగ్గురు కూతుర్లతో కుటుంబాన్ని వెళ్లదీస్తున్న దంపతులు కూతుర్లను మంచి చదువులను చదివించాలనే ఉద్దేశంతో వారి మొదటి కూతురు కావ్య (20)ను హైదరాబాద్‌లోని బీటెక్ చదివిస్తున్నారు. వారం రోజుల క్రితం మిర్గం పండుగకు సొంతూరుకు చేరుకున్న కావ్య అందరితో కలివిడిగానే ఉంది. ఉన్నట్టుండి రెండు రోజుల క్రితం తీవ్ర అస్వస్థతకు గురికావడంతో కుటుంబీకులు రామాయంపేటలో దవాఖానకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వెంటనే మెరుగైన చికిత్స కోసం సిద్దిపేటకు తరలించి చికిత్స చేయించారు. అయినా జబ్బు నయం కాకపోవడంతో సిద్దిపేట నుంచి హైదరాబాద్‌లోని ఓ కార్పొరేట్ దవాఖానలో చేర్పించారు. ఆదివారం రాత్రి వరకు బాగానే ఉన్న కావ్య ఉన్నట్టుండి పరిస్థితి విషమించి బ్రెయిన్ స్ట్రోక్‌తో చనిపోయింది. కావ్య మృతితో కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది. తల్లితండ్రులు రోదించిన తీరు ప్రతి ఒక్కరినీ కంటతడి పెట్టించింది. ఒకే కుటుంబంలో పదేండ్ల వ్యవధిలో కొడుకు, కూతురు చనిపోవడంతో గొల్పర్తి గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. రోదిస్తున్న తల్లితండ్రులను ఓదార్చడం ఎవరి తరమూ కావడం లేదు.